క్లుప్తంగా

భక్తిశ్రద్ధలతో గంగమ్మకు పొంగళ్లు



ప్రత్యేక అలంకరణలో గంగమ్మతల్లి

తాళ్లూరు: మండలంలోని తూర్పుగంగవరం పంచాయతీ పరిధిలోని సోమవరప్పాడులో ప్రసిద్ధిగాంచిన పుణ్యక్షేత్రమైన గుంటి గంగా భవానీ అమ్మ వారికి ఆదివారం కావడంతో ఏకువజామున నుంచే జిల్లా నలుమూలల నుంచి భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. పూజారులు మెట్టెల బాలరాజు, పి.విజయలక్ష్మి మూలవిరాట్‌ను ప్రత్యేకంగా అలంకరించారు. ఆలయ బ్రహ్మణ అర్చకుడు కామేశ్వర శర్మ అమ్మవారికి అభిషేకాలు, కుంకుమార్చన చేశారు. భక్తులు పొంగళ్లు పెట్టి అమ్మవారికి నైవేద్యం సమర్పించారు. పుట్ట,నాగ శిలలు, మల్లికార్జున స్వామి వారికి పూజలు చేశారు. భక్తులకు అవసరమైన వసతులు ఏర్పాట్లను ఆలయ ఈఓ జి.వాసు బాబు, చైర్మన్ కె.గురుబ్రహ్మం, ఏఆర్ కె.ప్రసాద్, సిబ్బంది పర్యవేక్షించారు.

గృహ నిర్మాణానికి జేసీ శంకుస్థాపన



గృహ నిర్మాణానికి శంకుస్థాపన చేసి పట్టా అందిస్తున్న జేసీ గోపాలకృష్ణ

మద్దిపాడు: పీ–4లో భాగంగా మద్దిపాడు మండలంలోని మల్లవరం గ్రామంలో గొల్లపూడి మరియమ్మ కుటుంబాన్ని దత్తత తీసుకున్న జేసీ గోపాలకృష్ణ.. ఆమెకు వారసత్వంగా వచ్చిన స్థలంలో గృహం నిర్మించేందుకు మంజూరు చేయించి ఆదివారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ పేదరికం లేని సమాజమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం రూపొందించిన పీ–4 పథకం ద్వారా పేదలకు అండగా నిలిచేందుకు తనవంతుగా మరియమ్మ కుటుంబాన్ని దత్తత తీసుకున్నానని తెలిపారు. ఆ కుటుంబానికి సంబంధించి అన్ని సదుపాయాలు కల్పించేందుకు కృషి చేస్తానని చెప్పారు. మరియమ్మ కుటుంబం ఆర్థికంగా నిలదొక్కుకునేందుకు కూడా అవసరమైన చర్యలు తీసుకుంటానని తెలిపారు. ఇంటి నిర్మాణానికి అదనంగా అయ్యే ఖర్చును తాను భరిస్తానన్నారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ నారా సుబ్బారెడ్డి, హౌసింగ్ పీడీ శ్రీనివాస ప్రసాద్, ఎంపీడీఓ వి.జ్యోతి, తహసీల్దార్ ఆదిలక్ష్మి, హౌసింగ్ శాఖ సిబ్బంది, స్థానిక నాయకులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఏకేయూ ప్రొఫెసర్‌కు అభినందనలు



వెంకటేశ్వరరెడ్డిని అభినందిస్తున్న రాష్ట్ర ఉన్నత విద్యామండలి చైర్మన్ మధుమూర్తి

ఒంగోలు సిటీ: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వంచే చరిత్ర సబ్జెక్ట్ ఎక్స్‌పర్ట్ చైర్మన్‌గా నియమితులైన ఒంగోలులోని ఆంధ్రకేసరి యూనివర్సిటీ ప్రొఫెసర్ డాక్టర్ డి.వెంకటేశ్వరరెడ్డిని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఉన్నత విద్యామండలి చైర్మన్ ప్రొఫెసర్ కే మధుమూర్తి, తదితరులు ఆచార్య నాగార్జున యూనివర్సిటీలో జరిగిన ఓ కార్యక్రమంలో అభినందించారు. రాష్ట్ర విభజన తర్వాత ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర చరిత్రను విస్తృతంగా అధ్యయనం చేయాలని, ఎక్కువ రచనలు చేసి ప్రజలకు తెలియజేయాలని మధుమూర్తి ఆకాంక్షించారు. కార్యక్రమంలో చరిత్ర అధ్యాపకులు డాక్టర్ కృష్ణప్రసాద్, డాక్టర్ రాజ్‌మహమ్మద్, డాక్టర్ సురేంద్ర, డాక్టర్ గంగాధర్, డాక్టర్ సహదేవ, తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు మలుపులు సరిచేయాలి

● ఎమ్మెల్యే తాటిపర్తి చంద్రశేఖర్



రోడ్డుకు అడ్డంగా ఉన్న రాళ్లను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే తాటిపర్తి

యర్రగొండపాలెం: ప్రమాదకరంగా మారిన రోడ్డు మలుపులను నేరుగా ఉండే విధంగా సరిచేయాలని ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి తాటిపర్తి చంద్రశేఖర్ ఆర్‌అండ్‌బీ అధికారులకు ఆదేశించారు. ఆదివారం మండలంలోని మురారిపల్లె చెరువు కట్టపై మలుపు తిరిగి ఉన్న రోడ్డును ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన ఆర్‌అండ్‌బీ అధికారులతో ఫోన్‌లో మాట్లాడారు. రోడ్డుకు అడ్డంగా ఉన్న రాళ్లను తొలగిస్తే నేరుగా వెళ్లేందుకు వీలవుతుందని, ఆ దిశగా రోడ్డు పనులు ప్రారంభించాలని ఆయన అన్నారు. పుల్లలచెరువు రోడ్డులో అనేక ప్రాంతాల్లో మలుపులు ఉన్నాయని, వాటిని సరిచేసేందుకు ప్రయత్నించాలని ఆయన ఆదేశించారు. ఈ మలుపుల వలన అనేక ప్రమాదాలు జరిగి ప్రాణాలు కోల్పోయిన ఘటనలు ఉన్నాయని ఆయన జ్ఞాపకం చేశారు. ఆయన వెంట పార్టీ మండల అధ్యక్షుడు ఏకుల ముసలారెడ్డి, పంచాయతీరాజ్ విభాగం రాష్ట్ర ఉపాధ్యక్షుడు భూమిరెడ్డి సుబ్బారెడ్డి, టి.సత్యనారాయణరెడ్డి, సర్పంచ్‌లు ఆవుల కోటిరెడ్డి, ఎస్.రంగబాబు ఉన్నారు.

చిన్నారులతో సందడి చేసిన ఎమ్మెల్యే వెంటే..

పుల్లలచెరువు: ఎమ్మెల్యే చంద్రశేఖర్ ఆదివారం మండలంలోని పలు గ్రామాల్లో జరిగిన శుభకార్యక్రమాల్లో పాల్గొన్నారు. మండలంలోని కొమరోలులో జరిగిన కార్యక్రమంలో చిన్నారులు ఎమ్మెల్యే చంద్రశేఖర్ తో పోటీ పడి ఫోటోలు దిగారు. కార్యక్రమంలో సర్పంచ్ కోటిరెడ్డి, రాష్ట్రపంచాయతీ రాజ్ వింగ్ సెక్రటరీ సుబ్బారెడ్డి, జిల్లా యాక్టివ్ సెక్రటరీ వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.



చిన్నారులతో ఎమ్మెల్యే చంద్రశేఖర్

మహిళలను విస్మరిస్తే పుట్టగతులుండవు


● మహిళా విభాగం రాష్ట్ర ప్రధానకార్యదర్శి అరుణమ్మ



ఉడుముల అరుణమ్మ

పుల్లలచెరువు: రాష్ట్ర ప్రజలనే కాకుండా మహిళలను కూడా ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు మోసం చేశారని వైఎస్సార్ సీపీ మహిళా విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఉడుముల అరుణమ్మ అన్నారు. ఆదివారం ఆమె ప్రకటనలో తెలియజేస్తూ ఎన్నికల ముందు ఎన్నో అబద్ధపు వాగ్దానాలు చేసి వాటిని నిలపెట్టుకోవడం లో పూర్తిగా విఫలమయ్యారన్నారు. ఆడబిడ్డ నిధి పథకం అమలు చేయాలంటే రాష్ట్రాన్ని అమ్మాలి అని అన్న మంత్రి అచ్చెన్నాయుడు ఉద్దేశం, వాటి వెనుక ఉన్నమర్మం ఏమిటని ఆమె ప్రశ్నించారు. కేవలం మహిళకు ఇచ్చిన హామీలను అమలు చేయకుండా బూటకపు మాటలు అంటున్నారని అన్నారు. ఎన్నికల సమయంలో సూపర్ సిక్స్‌తో పాటు 143 హామీలు ఇచ్చి ఇంటింటా తిరుగు ఊత బాండ్లు రాసిచ్చారని గుర్తు చేశారు. తీరా అధికారం చేపట్టగానే వాటిని అమలు చేయకుండా సహచర మంత్రులతో పథకాలు ఇవ్వలేమంటూ సుద్దపూస మాటలు చెప్పడం మహిళలను మరో మారు మోసం చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆడబిడ్డ నిధి పథకం ద్వారా 19–50 ఏళ్ల లోపు మహిళలకు నెలకు రూ.1500 ఇస్తానని ఎన్నికల ప్రసంగాల్లో ఊదరగొట్టి ఇప్పుడు ఆడబిడ్డ నిధి పథకం అమలు చేయాలంటే ఆంధ్రాను అమ్మాలంటూ మంత్రి అన్నారంటే ప్రభుత్వం చేతగాని తననానికి నిదర్శనం అన్నారు. సంపద సృష్టించి పథకాలు అమలు చేస్తానని కల్లిబొల్లి మాటలు చెప్పి అధికారం చేపట్టిన తరువాత పథకాలు అమలు సాధ్యం కాదని చెప్పడం మహిళా లోకాన్ని మోసం చేయడమేనన్నారు. గతంలో పనిచేసిన రాష్ట్ర మాజీ సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి కరోనా సమయంలో రాష్ట్రం క్లిష్ట పరిస్థితిలో ఉన్నా కూడ ప్రజలకు ఇచ్చిన వాగ్దానాలను అమలు చేసి ప్రజా గౌరవం పొందారని కొనియాడారు. త్వరలోనే రాష్ట్ర పార్టీ ఆదేశాల మేరకు ప్రతి ఇంటింటికి వెళ్లి కూటమి ప్రభుత్వం చేసిన కూటమి ప్రభుత్వం చేసిన అరాచరికాలు, అవినీతి, దౌర్జన్యాలను వివరించడం జరుగుతుందని తెలిపారు. మహిళలను విస్మరిస్తే ప్రభుత్వాలకు పుట్టగతులుండవని ఆమె అన్నారు.

ఘనంగా పోలేరమ్మ తల్లి కొలుపులు



ప్రత్యేక అలంకరణలో పోలేరమ్మ అమ్మవారు



పొంగళ్లు సమర్పిస్తున్న మహిళలు

తాళ్లూరు: మండలంలోని దోసకాయలపాడు గ్రామంలో వారం రోజులుగా జరుగుతున్న పోలేరమ్మ తల్లి కొలుపులు గ్రామ ప్రజలు భక్తి శ్రద్ధలతో సంప్రదాయ పద్ధతులతో పూజలు చేసి ఘనంగా నిర్వహించారు. ముందుగా అమ్మవార్లను అలంకరించి, పసుపు-కుంకుమలు, చీర, సారె, నైవేద్యాలు సమర్పించి, కొబ్బరికాయలు కొట్టి మొక్కులు తీర్చుకున్నారు. ఉత్సవంలో గ్రామ ప్రజలు, మండలంలోని పలు గ్రామల నుంచి వచ్చిన భక్తులు ఐకమత్యంతో పాల్గొని విజయవంతంగా జరిపారు.

అంకమ్మతల్లి కొలుపుల్లో పాల్గొన్న బూచేపల్లి, మేరుగు



అంకమ్మతల్లి కొలుపుల్లో పాల్గొన్న జెడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, నాయకులు

చీమకుర్తి రూరల్: మండలంలోని తొర్రగుడిపాడు గ్రామంలో జరుగుతున్న అంకమ్మతల్లి కొలుపుల్లో ఆదివారం జెడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, వైఎస్సార్ సీపీ సంతనూతలపాడు ఇన్‌చార్జ్, మాజీ మంత్రి మేరుగు నాగార్జున పాల్గొన్నారు. పార్టీ సీనియర్ నాయకుడు తెల్లమేకల గాంధీ ఆహ్వానం మేరకు పూజలో పాల్గొని టెంకాయలు కొట్టి అంకమ్మతల్లి ఆశీర్వచనాలు అందుకున్నారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు పమిడి వెంకటేశ్వర్లు, ఎంపీపీ యద్దనపూడి శ్రీనివాసరావు, జెడ్పీటీసీ వేమా శ్రీనివాసరావు, జిల్లా ప్రధాన కార్యదర్శి మన్నం శ్రీధర్‌బాబు, రామసాని సూర్యం, రైతు విభాగం మండల అధ్యక్షుడు నల్లూరి చంద్ర, దాసరి లక్ష్మీనారాయణ, కత్తి రమణారెడ్డి, డాక్టర్ బొడ్డపాటి హరిబాబు, కౌన్సిలర్లు మేకల సులోచన ఎల్లయ్య, ప్రమీల రామబ్రహ్మం, తప్పెట బాబు, శేషాద్రి, సుందరరామిరెడ్డి, మార్కు, పులి శ్రీను, కొణికి సుబ్రహ్మణ్యం, కృష్ణమూర్తి, హరిబాబు తదితరులు పాల్గొన్నారు.



పూజల్లో పాల్గొన్న మాజీ మంత్రి మేరుగు నాగార్జున

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

సంతనూతలపాడు (చీమకుర్తి రూరల్): సంతనూతలపాడు మండలంలోని చిలకపాడు సబ్‌స్టేషన్ పరిధిలో గల మద్దులూరు గ్రామంలో విద్యుత్ లైన్లకు మరమ్మతుల నిమిత్తం సోమవారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఏఈ టి.సంతోష్ ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 8 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరా ఉండదని, వినియోగదారులు సహకరించాలని కోరారు.

చెన్నకేశవునికి ఆభరణాల అందజేత

ఒంగోలు మెట్రో: కొప్పోలులోని కేశవక్షేత్రమైన చెన్నకేశవస్వామి, ఆంజనేయస్వామి దేవస్థానంలో రెండు కేజీల 520 గ్రాముల రజిత పితాంబరం (వెండి పంచ), సూర్య కటారి (వెండి ఖడ్గం)ని ఆదివారం ఉదయం దాతలు సమర్పించారు. కొప్పోలు వాస్తవ్యులు నూనె జాలరామయ్య, విజయలక్ష్మి దంపతులు, నూనె శ్రీనివాసరావు, శ్రీలక్ష్మి దంపతులు వాటిని అందించారు. ఈ సందర్భంగా ఆలయ ప్రధాన అర్చకులు పరాంకుశం సమీర్ కుమార్ విశ్వక్సేన పూజ, పుణ్యాహవాచనం, పంచామృతాభిషేకం, వాస్తు హోమం, సంప్రోక్షణ, సహస్రనామ పూజా క్రతువులను శాస్త్రోక్తంగా భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. స్థానిక భక్తులు, ఆలయ కార్యనిర్వహణాధికారి కట్టా సునీల్ కుమార్ పాల్గొన్నారు.

చేనుకు చీరకట్టి.. పచ్చదనాన్ని మూటగట్టి!



నారుమడి చుట్టూ రక్షణగా చీరలు కట్టిన దృశ్యం

పుల్లలచెరువు: పంటలను రక్షించుకునేందుకు రైతుల పాట్లు అనేకం. పక్షుల నుంచి, పందుల బారి నుంచి వేసిన నారుమళ్లను కాపాడుకునేందుకు పలు ప్రయోగాలు చేస్తున్నారు. అందులో భాగంగా పుల్లలచెరువు శివారు ప్రాంతంలో ఓ రైతు పొలంలో వద్ద నారుమడి చుట్టూ రక్షణగా చీరలను ఏర్పాటు చేశాడు. రంగురంగులున్న చీరలను చూసి పందులతో పాటు ఇతర జంతువులు రావని ఇలా ఏర్పాటు చేస్తున్నామని రైతులు చెప్తున్నారు.

నేడు బాబు ష్యూరిటీ–మోసం గ్యారెంటీ



కార్యకర్తలతో మాట్లాడుతున్న కాకర్ల, నాయకులు

తాళ్లూరు: మండల కేంద్రంలో ఉన్న వైఎస్సార్ సీపీ పార్టీ కార్యాలయం వద్ద సోమవారం ఉదయం 10 గంటలకు 'బాబు ష్యూరిటీ–మోసం గ్యారెంటీ' పేరుతో నిర్వహిస్తున్న కార్యక్రమానికి వైఎస్సార్ సీపీ కార్యకర్తలు, నాయకులు భారీగా తరలి రావాలని మండల పార్టీ అధ్యక్షుడు తూము సుబ్బారెడ్డి, రాష్ట్ర సంయుక్త కార్యదర్శి పోశం మధుసూదన్‌రెడ్డి ఆదివారం ఓ సంయుక్త ప్రకటనలో తెలిపారు. మండల స్థాయి విస్తృత సమావేశానికి ముఖ్య అతిథులుగా వైఎస్సార్ సీపీ జిల్లా పార్టీ అధ్యక్షుడు, దర్శి ఎమ్మెల్యే బూచేపల్లి శివప్రసాద్ రెడ్డి, జెడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ హాజరవుతారని పేర్కొన్నారు. కార్యక్రమానికి నియోజకవర్గస్థాయి నాయకులు, మండల కమిటీ సభ్యులు, అనుబంధ విభాగాల అధ్యక్షులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కోరారు.

రేపు దొనకొండలో బాబు షూరిటీ– మోసం గ్యారెంటీ

దొనకొండ: బాబు ష్యూరిటీ మోసం గ్యారంటీ పేరుతో 29వ తేదీ మంగళవారం ఉదయం 10 గంటలకు స్థానిక ఎస్‌ఆర్ పెట్రోలు బంక్ ఎదురుగా గల స్థలంలో నిర్వహిస్తున్న సమావేశానికి వైఎస్సార్ సీపీ కార్యకర్తలు, నాయకులు భారీగా తరలి రావాలని మండల కన్వీనర్ కాకర్ల క్రిష్టారెడ్డి పిలుపునిచ్చారు. దొనకొండలో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ.. వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు, దర్శి ఎమ్మెల్యే డాక్టర్ బూచేపల్లి శివప్రసాద రెడ్డి, జిల్లా పరిషత్ చైర్మన్ బూచేపల్లి వెంకాయమ్మ పాల్గొంటారన్నారు. కార్యక్రమానికి మండలం నుండి పార్టీ రాష్ట్ర జిల్లా, నియోజకవర్గ స్థాయి నాయకులు, మండల కమిటీ సభ్యులు, అనుబంధ విభాగ సభ్యులు, బూచేపల్లి అభిమానులు పెద్ద సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని క్రిష్టారెడ్డి కోరారు. కార్యక్రమంలో రాష్ట్ర క్రిస్టియన్ మైనార్టీ సెల్ కార్యదర్శి గుంటు పోలయ్య, జిల్లా యాక్టివిటీ సభ్యులు బత్తుల వెంకటసుబ్బయ్య యాదవ్ మాట్లాడిన వారిలో ఉన్నారు. కార్యక్రమంలో మండల ఉపాధ్యక్షులు ఇండ్ల శ్రీనివాసరావు, భీమిని వెంకటేశ్వర్లు, రాష్ట్ర క్రిస్టియన్ మైనార్టీ సెల్ కార్యదర్శి గుంటు పోలయ్య, జిల్లా యాక్టివిటీ సభ్యులు బత్తుల వెంకటసుబ్బయ్య యాదవ్, నియోజకవర్గం బూత్ కమిటీ కన్వీనర్ కాలూరి రమణయ్య, మాజీ జెడ్పీటీసీ గుంటు జాకోబు, మండల ఎస్సీ సెల్ అధ్యక్షులు వినుకొండ కొండలరావు, బీసీ సెల్ అధ్యక్షుడు పత్తి కొండ వెంకటసుబ్బయ్య యాదవ్, నాగిరెడ్డి వెంకటేశ్వరరెడ్డి, వడ్లమూడి బుజ్జి, గొంగటి పోలిరెడ్డి, ఎంపీటీసీ తాల్లూరి లక్ష్మీ నగేష్, పాతకోట కోటిరెడ్డి, తమ్మనేని సుబ్బారెడ్డి, ద్వారకచర్ల చెంచిరెడ్డి, గుమ్మా వెంకటేశ్వర్లు, పులిమి శివ, కిన్నెర ప్రసాద్, విప్పర్ల సుబ్బయ్య, మువ్వా రమణయ్య, తాటిగిరి మదన్, పాపా, షేక్.రసూల్, కందుల వెంకటేశ్వరరెడ్డి, కంది ఆంజనేయులు, పాతకోట ఆదినారాయణరెడ్డి, తమ్మనేని వెంకటేశ్వరరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

వరి నాట్లకు శ్రీకారం



తెల్లగట్లలో వరినాట్లు వేస్తున్న వ్యవసాయ కూలీలు

పుల్లలచెరువు: మండలంలోని పలు గ్రామాల్లో ఖరీఫ్ సీజన్‌లో రైతులు వరి నాట్లకు శ్రీకారం చుట్టారు. మండలంలోని సాగర్ పరివాహక ప్రాంతంలోను, నీటి వసతి ఉన్న ప్రాంతల్లో వరి పంటను సాగు చేయడానికి రైతులు పొలాలను సిద్ధం చేసుకుంటున్నారు. మండలంలోని ఐటీవరం, మానేపల్లి పంచాయతీల్లో సాగర్ కాలువ పారుదల ఉండడంతో రైతులు ఎక్కువ భాగంగా వందల ఎకరాల్లో వరి పంటనుసాగు చేయనున్నారు. ముటుకుల, శతకోడు పంచాయతీలతో పాటు మరి కొన్ని గ్రామాల్లో ఇటీవల కురిసిన వర్షాలకు చెరువుల్లోను, కుంటల్లోను నీరు నిల్వ చేరడంతో రైతులు వరి నాట్లు వేస్తున్నారు. మొక్కజొన్న, ఆరటి, బొప్పాయి పంటలను పుల్లలచెరువు, ఉమ్మడివరం, ఐటీవరం, మానేపల్లి, శతకోడుల, నాయుడుపాలెం, పీపీపల్లి, చెన్నంపల్లి, సీ కొత్తపల్లి గ్రామాల్లో భారీ ఎత్తున సాగు చేస్తున్నారు. గత ఏడాది సాగు చేసిన ఎండుమిర్చికి గిట్టుబాటు ధరలు లేక పోవడంతో ఇప్పటికి మార్కెట్‌లోనే మగ్గుతున్నాయని రైతులు గగ్గోలు పెడుతున్నారు. నీటి వసతి ఉన్న ప్రాంతాల్లో రైతులు వరి పంటను సాగు చేయడానికి సిద్ధం అవడంతో రైతులు నారును ఇతర ప్రాంతాల నుంచి కొనుగోలు చేసినాట్లను పూర్తి చేస్తున్నారు. ఈ సమయంలో నాట్లు వేస్తే రబీలో కూడా ఆశించిన దిగుబడులు వస్తాయని రైతులు పేర్కొంటున్నారు.

స్వమిత్ర-2పై నేటి నుంచి శిక్షణ

మద్దిపాడు: స్వమిత్ర ఫేజ్–2కు ఎంపికైన అన్నంగి, ఏడుగుండ్లపాడు, గార్లపాడు, కొలచనకోట, లింగంగుంట, మల్లవరం, పెదకొత్తపల్లి, రాచవారిపాలెం, ఇనమనమెళ్లూరు గ్రామాల పంచాయతీ కార్యదర్శులు, ఇంజినీరింగ్ సహాయకులు, డిజిటల్ సహాయకులు, సర్వేయర్లు, వీఆర్‌ఓలకు మద్దిపాడులో సోమ, మంగళవారాలు రెండు రోజులపాటు శిక్షణ కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు ఈఓపీఆర్‌డీ కె.రఘుబాబు తెలిపారు. అందరూ తప్పనిసరిగా హాజరుకావాలని, ఎవరికీ మినహాయింపు లేదని ఆయన స్పష్టం చేశారు.

ప్రజల ఐక్యతతోనే విద్యుత్ సంస్కరణలు వెనక్కి



సమావేశంలో మాట్లాడుతున్న సిద్దయ్య

నాగులుప్పలపాడు: కార్పొరేటర్లకు రాయితీలు కల్పించి సామాన్య ప్రజలపై భారాలు మోపే విధంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తీసుకొచ్చిన విద్యుత్ సంస్కరణలను తిప్పికొట్టాలంటే ప్రజల ఐక్యతతోనే సాధ్యమవుతుందని సుందరయ్య విజ్ఞాన కేంద్రం హైదరాబాద్ మాజీ కార్యదర్శి సిద్దయ్య తెలిపారు. మండలంలోని ఉప్పుగుండూరులో రజక కళ్యాణ మండపంలో ప్రజాసంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో వినియోగదారులను కొల్లగొట్టే అదానీ విద్యుత్ స్మార్ట్ మీటర్లు ఆపాలని కోరుతూ ఆదివారం సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా సిద్దయ్య మాట్లాడుతూ రాష్ట్రంలో బాగున్న 2 కోట్ల మీటర్లను తొలగించి అదానీ స్మార్ట్ మీటర్ల బిగింపునకు పూనుకోవడం సమంజసం కాదని విమర్శించారు. ఈపాటికే కొన్ని ప్రాంతాల్లో బిగించిన స్మార్ట్ మీటర్ల వలన విద్యుత్ బిల్లులు గతం కంటే రెట్టింపు వచ్చాయన్నారు. దాంతో సామాన్య ప్రజలు చిన్న వ్యాపార సంస్థలు తల్లడిల్లిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. గత ప్రభుత్వం సెకీ ఒప్పందంతో 1750 కోట్లు లంచం తీసుకుని కుదుర్చుకున్న ఒప్పందం ద్వారా స్మార్ట్ మీటర్ల బిగింపునకు శ్రీకారం చుట్టిందన్నారు. ఎన్నికల నేపథ్యంలో తాము అధికారంలోకి వస్తే స్మార్ట్ మీటర్లు పగలగొడతామని, జగన్‌పై చర్యలు తీసుకుంటామని చెప్పిన కూటమి ప్రభుత్వం ఒక్క మాట కూడా మాట్లాడకుండా అదానీకి అనుకూలంగా అవే విధానాలు అమలు చేస్తోందని విమర్శించారు. తద్వారా స్మార్ట్ మీటర్ల బిగింపుతో ప్రజలపై భారాలు మోపుతోందన్నారు. సంపన్నులకు కొమ్ము కాస్తూ మతం పేరుతో ఉన్మాదపూరితమైన విధానాలు అవలంబిస్తున్న పాలకులను వ్యతిరేకించాలన్నారు. ప్రజలపై భారాలు మోపే విధంగా తీసుకొచ్చిన విద్యుత్ సంస్కరణలను తిప్పికొట్టాలంటే ప్రజలంతా ఐక్యం కావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ప్రజాసంఘాల ఐక్యవేదిక నాయకులు టి.శ్రీకాంత్, ఎన్.రామారావు, కాకాని సుబ్బారావు, యు.వెంకటేశ్వర్లు, గ్రామస్తులు పాల్గొన్నారు.

బహిరంగ ప్రదేశాల్లో మద్యం తాగితే చర్యలు

టంగుటూరు: బహిరంగ ప్రదేశాల్లో మద్యం తాగితే కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్సై నాగమల్లీశ్వరరావు అన్నారు. మండలంలోని పలు గ్రామాల్లో పర్యటించి రోడ్ల వెంబడి, బహిరంగ ప్రదేశాల్లో మద్యం తాగుతున్న వారిని హెచ్చరించారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ మందుబాబు బహిరంగంగా పొలాల్లో మద్యం తాగి సీసాలు పగలకొడుతున్నారని, దీని వల్ల రైతులకు ఇబ్బంది ఎదురవుతుందన్నారు. బహిరంగ ప్రదేశాల్లో మద్యం తాగుతున్న వారిని 10 మందిని డ్రోన్ సాయంతో గుర్తించివారికి కౌన్సెలింగ్ ఇచ్చారు. అనంతరం టోల్‌ప్లాజా వద్ద వాహన తనిఖీలు చేసి 10 మంది వాహనదారులకు రూ.1850 జరిమానా విధించారు.



కౌన్సెలింగ్ ఇస్తున్న ఎస్సై